
దెబ్బతిన్న తూములు

చెరువుల్లో పుష్కలంగా నీరు ఉంటే ఆయకట్టు సాగుతుంది. సమీపంలోని బావులు, బోర్లలో భూగర్భ జలాలు పెరుగుతాయి. పంటలు సమృద్ధిగా పండితే మార్కెట్‌లో నిత్యావసర సరుకుల ధరలు స్థిరంగా ఉంటాయి. కూటమి ప్రభుత్వం చెరువు కట్టల బలోపేతంపై దృష్టి సారించకపోవడంతో కట్టలు బలహీనంగా మారాయి. తూములు, కలుజులు దెబ్బతిన్నాయి. చెరువుల్లోకి చేరిన వర్షపు నీరు వృథాగా పోతోంది. ఈ విషయం తెలిసినా ఇరిగేషన్ అధికారులు పట్టించుకోకపోవడంపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

- పూడిపోయిన పంట కాలువలు
- వర్షాలు కురుస్తున్నా చెరువుల్లో నిలవని నీరు
- బలహీనంగా చెరువు కట్టలు
- ఆయకట్టు సాగేదెలా అని రైతుల ఆందోళన
- పట్టించుకోని ఇరిగేషన్ అధికారులు


దొరవారిసత్రం : నెలబల్లి సమీపంలో రైల్వే మార్గంలో దుస్థితిలో ఉన్న తూములు


దొరవారిసత్రం : కనుమరుగైన నెలబల్లి చెరువు పంట కాలువ

దొరవారిసత్రం/పెళ్లకూరు : దొరవారిసత్రం మండలంలో ఇరిగేషన్ శాఖ కింద 35, పీఆర్ శాఖ కింద 105 చెరువులు ఉన్నాయి. ఇవి సుమారు 2450 హెక్టార్ల విస్తీర్ణంలో వ్యాపించి ఉన్నాయి. ఈ చెరువుల కింద 27,512 ఎకరాల ఆయకట్టు భూములు ఉన్నాయి. చెరువుల పూర్తి స్థాయిలో నిండితే ప్రధాన పంటగా వరి సాగు చేస్తారు. దీంతో పాటు వేరుశనగ, పుచ్చ, వివిధ రకాల కూరగాయలను పండిస్తారు. తద్వారా 10,850 రైతులు పంటలు సాగు చేస్తున్నారు. పెళ్లకూరు మండలంలో 38 మైనర్ ఇరిగేషన్, 16 చిన్న చెరువులు ఉన్నాయి. వీటి కింద 5015 హెక్టార్ల ఆయకట్టు భూములు ఉన్నాయి. 4500 మంది రైతులు పంటలు సాగుచేస్తున్నారు. ఈ మండలంలో చెరువులు పూర్తి స్థాయిలో నిండితే 4,750 హెక్టార్లలో వరి, 350 ఎకరాల్లో వేరుశనగ, 500 ఎకరాల్లో కూరగాయలు పండిస్తారు. అర్ధమాల, భీమవరం, రావులపాడు, కానూరు, చెన్నప్పనాయుడుపేట, నందిమాల, చావలి చెరువు కట్టలు ప్రమాదకరంగా ఉన్నాయి. తూములు, కలుజులు మరమ్మతులకు గురయ్యాయి. దీంతో చెరువుల్లోకి నీరు వచ్చినా పూర్తిస్థాయిలో నిల్వ ఉండే పరిస్థితి లేదు.

దొరవారిసత్రంలోని చెరువులు	:	145
ఆయకట్టు భూములు	:	27,512 ఎకరాలు
పెళ్లకూరులోని చెరువులు	:	54
ఆయకట్టు భూములు	:	5015 హెక్టార్లు

పూడిపోయిన సప్లయ్ చానళ్లు

దొరవారిసత్రం మండలం నెలబల్లి పెద్ద చెరువుకు నీటిని తీసుకువచ్చే కాలువ రైలు పట్టాల సమీపంలో పూడిపోయింది. రైలు ట్రాక్ వేసేటప్పుడు కాలువ నీరు వెళ్లేలా గతంలో తూములు ఏర్పాటుచేశారు. ప్రస్తుతం మట్టితో పూడిపోయాయి. అదే విధంగా పెళ్లకూరు మండలంలో కురిసిన వర్షపు నీటిని తీసుకువచ్చే నెలబల్లి ప్రధాన పంట కాలువను టైల్స్ కంపెనీ వారు పూడ్చేసినట్లు రైతులు తెలిపారు. దీంతో చెరువుకు వర్షపు నీరు రావడం లేదు. పెళ్లకూరు మండలంలో స్వర్ణముఖి నది నుంచి కలవకూరు సప్లయ్ చానల్ ద్వారా కలవకూరు, పెరుమాళ్లపల్లి, యడపూడి, పిడికిటిమాల, పాలచ్చూరు, కప్పగుంటకండ్రిగ, దిరసనమాల గ్రామాల చెరువులకు నీరు చేరుతుంది. ప్రస్తుతం కాలువ ముళ్ల చెట్లు, పిచ్చిమొక్కలతో నిండిపోయింది. దీంతో వర్షపు నీరు రావడం లేదని రైతులు వాపోతున్నారు. చెరువుల్లో సామర్థ్యం మేర నీరు నిల్వ చేసుకోలేక, విద్యుత్ మోటార్లు ఏర్పాటు చేసుకొనే స్థోమత లేక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా జీలపాటూరు, పెళ్లకూరు, పునబాక, అర్ధమాల, చెంబేడు, చిల్లకూరు, బంగారంపేట, మోదుగులపాళెం, నందిమాల, పాలచ్చూరు తదితర గ్రామాలకు చెందిన రైతులు చెరువు నీటిపైనే ఆధారపడి పంటలు సాగు చేసుకుంటూ ఉంటారు. చెరువు కట్టలు, కలుజులు, తూములు, కాలువలు మరమ్మతులకు గురి కావడంతో చెరువుల్లో నీరు నిల్వ ఉండకపోవడంతో పంటలు సాగు చేయలేని దుస్థితి నెలకొంది.

పరిశీలించి చర్యలు చేపడతాం

నెలబల్లి పెద్ద చెరువు కింద 266.28 ఎకరాలు ఆయకుట్టు భూములు ఉన్నాయి. ఈ చెరువుకు చెందిన పంట కాలువ, రైలు పట్టాలు దాటే ప్రాంతంలో పూడియిన తూములను పరిశీలిస్తాం. నిధుల కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపి కాలువను అభివృద్ధి చేస్తాము.

- హరికృష్ణ, జేఈ, ఇరిగేషన్ శాఖ, దొరవారిసత్రం


ప్రమాదకరంగా ఉన్న పెళ్లకూరు గ్రామ చెరువు కట్ట


పెళ్లకూరు : అధ్వానంగా ఉన్న చెంబేడు చెరువు తూము


పెళ్లకూరు : తెగేందుకు సిద్ధంగా ఉన్న దిరసనమాల చెరువు కట్ట


పెళ్లకూరు : గ్రావెల్ తరలింపు కోసం తవ్వేసిన కప్పగుంటకండ్రిగ చెరువు కట్ట

కాలువకు మరమ్మతులు చేయాలి



నెలబల్లి గ్రామ సమీపంలోని పెద్ద చెరువుకు నీటిని తీసుకువచ్చే కాలువ రైలు పట్టాలు దాటే ప్రాంతంలో పూడిపోయింది. అధికారులు స్పందించి కాలువకు మరమ్మతులు చేపట్టి చెరువులోకి నీరు చేరేలా చర్యలు తీసుకోవాలి. చెరువులోకి చేరకపోతే రైతులకు సాగునీటి కష్టాలు తప్పవు.

- సురేష్‌రెడ్డి, రైతు, నెలబల్లి, దొరవారిసత్రం

కాలవను పూర్తి స్థాయిలో అభివృద్ధి చేపట్టాలి



నెలబల్లి పెద్ద చెరువుకు చెందిన ప్రధాన కాలువ పలుచోట్ల అస్తవ్యస్తంగా ఉంది. ముళ్లపొదలు పెరగడంతో కాలువ కనిపించడం లేదు. వర్షపు నీరు రావడం లేదు. ఈ విషయాన్ని గతంలో అధికారులకు తెలిపినా ఫలితం లేదు. ఇప్పటికైనా కాలువ అభివృద్ధి చేసేలా అధికారులు చర్యలు చేపట్టాలి.

- భాస్కర్‌రెడ్డి, రైతు, నెలబల్లి, దొరవారిసత్రం

చెరువులు అభివృద్ధి చేయాలి



పెళ్లకూరు మండలంలోని చెరువు కట్టలు బలహీనంగా ఉన్నాయి. చాలా ఏళ్లుగా మరమ్మతు పనులకు నోచుకోలేదు. నీరు వచ్చినా నిల్వ ఉండడం లేదు. పంటకు చివరి తడి అందించడానికి కష్టాలు పడాల్సి వస్తోంది. ప్రత్యేక నిధులు కేటాయించి చెరువులను అభివృద్ధి చేయాలి.

- తిరుపాలయ్య, అర్ధమాల, పెళ్లకూరు

చెంబేడు చెరువు రిజర్వాయర్ చేయాలి



పెళ్లకూరు మండలం చెంబేడు చెరువును రిజర్వాయర్‌గా అభివృద్ధి చేస్తే ఎంతో మంది రైతులకు ఉపయోగంగా ఉంటుంది. ఈ చెరువు నుంచి దిగువ ప్రాంతాల్లోని 17 చెరువులకు నీరు సరఫరా అవుతుంది. పాలకులు మారుతున్నప్పటికీ చెంబేడు చెరువు అభివృద్ధికి నోచుకోవడం లేదు.

- వెంకటేశ్వర్లు, చెంబేడు, పెళ్లకూరు

క్లుప్తంగా

గిరిజనులకు దుప్పట్ల పంపిణీ


దుప్పట్లు పంపిణీ చేస్తున్న రొటరీ క్లబ్ సభ్యులు

గూడూరు రూరల్ : చలికాలంలో పేద గిరిజనులకు దుప్పట్లు పంపిణీ చేయడం సంతోషంగా ఉందని వైఎస్సార్ సీపీ నాయకుడు, రొటేరియన్ ఎల్లసిరి గోపాల్‌రెడ్డి తెలిపారు. గూడూరు రెండో పట్టణం ఇందిరానగర్‌లోని గిరిజన కాలనీకి చెందిన పలువురికి శుక్రవారం రోటరీ వెస్ట్ క్లబ్ ఆధ్వర్యంలో శ్రీ వెంకటేశ్వర డ్రైవింగ్ స్కూల్ యాజమాన్యం దుప్పట్లు అందజేసింది. రొటేరియన్ ఆడిటర్ శ్రీకంఠి రామోహన్‌రావు, క్లబ్ అధ్యక్షుడు నాశిన నాగులు, కార్యదర్శి చోళవరం గిరిబాబు, రొటేరియన్లు దువ్వూరు రవీంద్రరెడ్డి, డీవీ బాలసుబ్రమణ్యం, ధనుంజయరెడ్డి, బలరామిరెడ్డి, పర్చూరి సుబ్రమణ్యం పాల్గొన్నారు.

విద్యుత్ సబ్ స్టేషన్ తనిఖీ

కలువాయి: వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్‌ను సరఫరా చేసేందుకు కృషి చేయాలని విద్యుత్ శాఖ రాపూరు ఏడీ సురేష్ ఆదేశించారు. ఆయన శుక్రవారం కలువాయి సబ్‌స్టేషన్‌ను తనిఖీ చేశారు. సిబ్బందితో సమావేశమై పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. విద్యుత్ సర ఫరాలో అవాంతరాలను తగ్గించాలని, ప్రజల నుంచి వచ్చే వినతుల పరిష్కారానికి ప్రథమ ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. విద్యుత్ సిబ్బంది ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరిస్తామన్నారు.

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం


జయంపులో ఇళ్ల నిర్మాణాలను పరిశీలిస్తున్న ఈఈ శ్రీనివాసరావు

బాలాయపల్లి(సైదాపురం) : ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని హౌసింగ్ ఈఈ శ్రీనివాసరావు ఆదేశించారు. ఆయన శుక్రవారం బాలాయపల్లి మండలంలోని జయంపు గ్రామంలో నిర్మాణంలో ఉన్న ఇళ్లను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ చాలా ఇళ్ల గోడలు, పునాది దశ లో ఉన్నాయని, లబ్ధిదారులకు అవగాహన కల్పించి పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు.

క్రీడాకారులకు బహుమతులు


జ్ఞాపికలు అందుకున్న విద్యార్థులతో జేవీవీ ప్రతినిధులు, ఉపాధ్యాయులు

గూడూరు రూరల్ : నెల్లూరులో గత నెలలో జిల్లా స్థాయి హాకీ, షటిల్, టెన్నిస్, ఖోఖో, కబడ్డీ తదితర పోటీలు నిర్వహించారు. ఇందులో గూడూరు పట్టణానికి చెందిన పలు పాఠశాలలు క్రీడల్లో ప్రతిభ చూపారు. వారికి శుక్రవారం గూడూరులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో బహుమతులు అందజేశారు. విద్యార్థులకు వాకాటి రామ్మోహన్ దాతృత్వంతో బూట్లు, జ్ఞాపికలు అందజేసినట్లు జేవీవీ ప్రతినిధులు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయురాలు కల్పన, జేవీవీ ప్రతినిధులు పురుషోత్తం, చెంచునారాయణ, ఇన్‌చార్జి హెచ్‌ఎం వరప్రసాద్, నాగరాజు, పీడీ శివకుమార్ పాల్గొన్నారు.

కంపెనీ లారీల అడ్డగింత


వాహనాలను అడ్డుకుంటున్న కూటమి నాయకులు, కార్యకర్తలు

పెళ్లకూరు: మండలంలోని శిరసనంబేడులో గురువారం రాత్రి అధిక లోడుతో వెళుతున్న భారీ వాహనాలను గ్రామస్తులు, కూటమి నేతలు అడ్డుకున్నారు. వారు మాట్లాడుతూ గ్రామంలోని అమ్మట్రె స్టీల్ పరిశ్రమకు వచ్చి వెళ్లే వాహనాల వల్ల సుమారు మూడు కిలోమీటర్ల మేర రోడ్డు పూర్తిగా దెబ్బతినిందన్నారు. దీంతో రోడ్డుకు ఇరువైపులా ఉన్న ఇళ్లలోకి దుమ్ము చేరుతోందని, పెద్ద పెద్ద గుంతలతో పలువురు ప్రమాదాల బారినపడుతున్నారని తెలిపారు. వారు రాత్రంతా రోడ్డుపై చలిమంటలు వేసుకుని బైఠాయించి వాహనాలను అడ్డుకున్నారు. శుక్రవారం ఉదయం సమాచారం అందుకున్న ఎస్‌ఐ నాగరాజు అక్కడికి చేరుకుని పరిశీలించారు. గతంలో లారీల వల్ల బాలుడు మృతిచెందినట్లు నాయకులు తెలిపారు. చెక్ పోస్టు నుంచి స్టీల్ పరిశ్రమ వరకు రోడ్డును అభివృద్ధి చేయాలని డిమాండ్ చేశారు. గ్రామ పెద్దలు జోక్యం చేసుకుని కంపెనీ ప్రతినిధులతో మాట్లాడి సర్దుబాటు చేశారు. కేశవరెడ్డి, రమణయ్య, సునీల్, ప్రసాద్, గోపాల్‌రెడ్డి, కృష్ణయ్య, రఘురామయ్య పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శిపై వేటు

కోట: మండలంలోని కొత్తపట్నం పంచాయతీ కార్యదర్శి టీ.రాజశేఖర్‌ను సస్పెండ్ చేస్తూ నెల్లూరు జిల్లా డీపీవో ఆదేశాలు జారీచేసినట్లు ఎంపీడీవో వేణు శుక్రవారం తెలిపారు. రాజశేఖర్ గతంలో ముత్తుకూరు మండలం కృష్ణపట్నం పంచాయతీ కార్యదర్శిగా పనిచేశారు. ఆ సమయంలో నిధుల దుర్వినియోగానికి పాల్పడినట్టు ఆరోపణలు వెల్లువెత్తాయి. దీనిపై విచారణ చేపట్టిన ఉన్నతాధికారులు ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు. కేసవరం పంచాయతీ కార్యదర్శి అల్లాబక్షును కొత్తపట్నం ఇన్‌చార్జి పంచాయతీ కార్యదర్శిగా నియమించినట్లు తెలిపారు.

మాదకద్రవ్యాలతో భవిష్యత్తు నాశనం


రాపూరు : మాట్లాడుతున్న ఎస్‌ఐ వెంకట రాజేష్


కలువాయి : మాట్లాడుతున్న ఎస్‌ఐ సుమన్

సైదాపురం/రాపూరు/కలువాయి : మాదకద్రవ్యాలతో భవిష్యత్తు నాశనమవుతుందని సైదాపురం, రాపూరు, కలువాయి ఎస్‌ఐలు క్రాంతికుమార్, వెంకటరాజేష్, సుమన్ తెలిపారు. వారు శుక్రవారం సైదాపురం జెడ్పీ ఉన్నత పాఠశాల, రాపూరులోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, కలువాయి ఉమామహేశ్వరి కల్యాణ మండపంలో మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే అనర్థాలు, ఈవ్‌టీచింగ్, ర్యాగింగ్, సైబర్ క్రైమ్, మోటార్ వెహికల్ చట్టాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. యువత సమాజాభివృద్ధిలో కీలకపాత్ర పోషించాలని, చెడు అలవాట్లకు బానిసలు కావద్దని కోరారు. బిడ్డలు ఉన్నత స్థాయికి చేరుకోవాలని తల్లిదండ్రులు కలలు కంటూ ఉంటారని తెలిపారు. యువత చెడు వ్యసనాలకు బానిసలై జీవితాలను నాశనం చేసుకోవద్దన్నారు. మంచి లక్ష్యాలను ఏర్పరుచుకుని వాటి సాధనకు కృషి చేయాలని సూచించారు. ఎవరైనా మాదకద్రవ్యాలు విక్రయిస్తుంటే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. కార్యక్రమంలో రాపూరు డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ హనుమంతరావు, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ వెంకట్‌నాయక్, కలువాయి ఎంఈవో శేషగిరిరావు, జెడ్పీహెచ్‌ఎస్ హెచ్‌ఎం అబ్బాస్‌అలీ, విశ్రాంత ఉపాధ్యాయులు ఎ.మల్లికార్జునయ్య తదితరులు పాల్గొన్నారు.

క్రీడా పోటీల్లో ఓవరాల్ చాంపియన్ కావలి



ప్రథమ స్థానంలో నిలిచిన కావలి జట్టు, బహుమతి అందుకుంటున్న టేబుల్ టెన్నిస్ విజేత జట్టు

గూడూరు రూరల్ : పట్టణంలోని ఎస్‌కే ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నెల్లూరు విక్రమ సింహపురి యూనివర్సిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అంతర్ కళాశాలల క్రీడా పోటీలు శుక్రవారం ముగిశాయి. ఇందులో కావలికి చెందిన జట్లు ఓవరాల్ చాంపియన్‌షిప్‌ను సొంతం చేసుకున్నాయి. కళాశాల ప్రిన్సిపాల్ శివప్రసాద్ మాట్లాడుతూ ఫుట్‌బాల్ పోటీల్లో కావలికి చెందిన జేబీ డిగ్రీ కళాశాల జట్టు ప్రథమ స్థానం, నెల్లూరుకు చెందిన క్రిష్ణ చైతన్య కళాశాల ద్వితీయ స్థానంలో నిలిచినట్టు తెలిపారు. అలాగే ఖోఖోలో జేబీ డిగ్రీ కళాశాల ప్రథమ, నెల్లూరుకు చెందిన జీనెక్స్ డిగ్రీ కళాశాల జట్లు ద్వితీయ స్థానం సాధించాయని పేర్కొన్నారు. టేబుల్ టెన్నిస్ సింగిల్ విభాగంలో వీఎస్‌యూ పీజీ సెంటర్ ప్రథమ, జేబీ డిగ్రీ కళాశాల జట్లు ద్వితీయ స్థానాల్లో నిలిచాయన్నారు. అలాగే టేబుల్ టెన్నిస్ డబుల్స్ విభాగంలో కావలి జేబీ డిగ్రీ కళాశాల, వీఎస్‌యూ పీజీ సెంటర్ ద్వితీయ స్థానంలో నిలిచినట్టు వెల్లడించారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో టోర్నమెంట్ ఆర్గనైజింగ్ కార్యదర్శి డాక్టర్ నారాయణరాజు, అబ్జర్వర్ వెంకటేశ్వర్లు, పీడీ రవీంద్రబాబు, ప్రసాద్‌రెడ్డి, ప్రవీణ్‌కుమార్, మణికంఠ, శ్రీనివాసులు, తిరుపాల్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా సత్యనారాయణ స్వామి వ్రతం


వ్రతంలో పాల్గొన్న దంపతులు

చిట్టమూరు (చిల్లకూరు) : చిట్టమూరు మండలం మల్లాంలో వెలసిన శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రమణ్యేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం వన భోజనాలు, సత్యనారాయణ స్వామి వ్రతాన్ని ఘనంగా చేపట్టారు. ముందుగా స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ ఆవరణలోని మండపంలో సత్యనారాయణ స్వామి వ్రత కల్పం చేపట్టారు. పలువురు దంపతులు వ్రతంలో పాల్గొన్నారు. తదుపరి ఉసిరి చెట్టు కింద వన భోజనాలు నిర్వహించారు.

భారీ వాహనాలతో స్తంభిస్తున్న ట్రాఫిక్


నాలుగు వాహనాలు వెళ్లే మార్గాన్ని ఆక్రమించి నిదానంగా వెళుతున్న భారీ వాహనం


జాతీయ రహదారిపై వెనుక వచ్చే వాహనాలకు దారి ఇచ్చేందుకు నిలిపిన భారీ వాహనం

చిల్లకూరు : జాతీయ రహదారిపై భారీ వాహనాల రాకపోకలు సాగించే సమయంలో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతోంది. ఈ క్రమంలోనే శుక్రవారం రెండు భారీ వాహనాలు నాయుడుపేట నుంచి నెల్లూరు వైపు వెళ్లాయి. దీంతో గూడూరు, నెల్లూరు వైపు వెళ్లే కార్లు, ఆటోలు, బస్సులు, లారీలు ఇబ్బంది పడాల్సి వచ్చింది. అక్కడక్కడా జాతీరహదారిపై రోడ్డు వెడల్పు ఉన్న చోట భారీ వాహనాలు ఆగడంతో వెనక వచ్చే వాహనాలు ముందుకు వెళ్లాయి.

రేపు కోటలో వనభోజనాలు

కోట: గ్రామదేవత కోటమ్మ ఆలయంలో ఆదివారం షిరిడీసాయి అక్షయ సేవా సేమితి ఆధ్వర్యంలో కార్తీక మాస వనభోజన మహోత్సవాన్ని నిర్వహించనున్నట్లు ధర్మకర్త నల్లపరెడ్డి జగన్‌మోహన్‌రెడ్డి తెలిపారు. గోపూజ, భవానీ శంకరునికి ఏకాదశ రుద్రాభిషేకం, అన్నాభిషేకం నిర్వహిస్తామన్నారు. అనంతరం వనభోజనాలు ఉంటాయని వెల్లడించారు.

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

సైదాపురం: విద్యార్థులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని రాపూరు సీడీపీవో సునంద, వోఎస్‌డీ షహజాన్ తెలిపారు. సైదాపురం ఉన్నత పాఠశాలలో శుక్రవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో చట్టాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. వారు మాట్లాడుతూ ఎవరైనా బాలికలతో అసభ్యంగా ప్రవర్తిస్తే పోలీసులకు ఫిర్యాదు చేయా లని సూచించారు. బాల్య వివాహాలు చేసుకోవడం వల్ల అనేక అనర్థాలు కలుగుతున్నాయన్నారు.

పేద కుటుంబాలకు చేయూత

వాకాడు : మండలంలోని కోడివాక గ్రామంలోని పేద కుటుంబాలకు శుక్రవారం సీతారామ ధార్మిక సేవా సంస్థ సరుకులు, కూరగాయలు అందజేసింది. కార్తీక మాస పర్వదినాలను పురస్కరించుకుని గ్రామంలో ఆర్థికంగా వెనుకబడిన వారిని దాతల ద్వారా ఆదుకుంటున్నట్టు సంస్థ ప్రతినిధులు తెలిపారు. ఈ క్రమంలో ప్రముఖ సినీ సంగీత దర్శకుడు సాలూరు కోటి, జ్యోతి దంపతుల ఆర్థిక సాయంతో సరుకులు, కూరగాయలు, ఫ్యాన్సీ సరుకులు, కొంత నగదు అందజేసినట్టు వెల్లడించారు. కార్యక్రమంలో దీవి అనంతాచార్యులు, పవన్‌కుమార్, నాగమౌనిక, ఆలూరు లక్ష్మీనరసింహారావు, గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కండలేరులో 52.188 టీఎంసీల నీరు

రాపూరు: కండలేరు జలాశయంలో శుక్రవారం నాటికి 52.188 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. సోమశిల జలాశయం నుంచి కండలేరుకు 1,900 క్యూసెక్కుల నీరు వస్తోందని తెలిపారు. కండలేరు నుంచి సత్యసాయి గంగ కాలువకు 1000, పిన్నేరు కాలువకు 20, లోలెవల్ కాలువకు 60, హైలెవల్ కాలువకు 100, మొదటి బ్రాంచ్ కాలువకు 55 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

నాయుడుపేట టౌన్ : నాయుడుపేట పట్టణంలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ తీగలు మరమ్మతుల కారణంగా శనివారం విద్యుత్ సరఫరా నిలిపేస్తున్నట్లు ఏఈ శివశంకర్ తెలిపారు. ఉదయం 8 నుంచి 11 వరకు పట్టణంలో విద్యుత్ సరఫరా ఉండదన్నారు. విద్యుత్ వినియోగదారులు, రైతులు ఈ విషయాన్ని గమనించి సహకరించాలని కోరారు.

దారి కోసం రోడ్డుపై గ్రామస్తుల బైఠాయింపు


నిరసన తెలుపుతున్న నాంచారమ్మపేట గ్రామస్తులు

చిల్లకూరు : ఎన్నోఏళ్లుగా ఉన్న దారినే తమకు ఇవ్వాలని మండలంలోని నాంచారమ్మపేటకు చెందిన దళితులు శుక్రవారం వరగలి రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. దీంతో సుమారు గంటకు పైగా రెండు వైపులా వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. గ్రామస్తులు మాట్లాడుతూ గ్రామంలో ఎవరైనా మృతి చెందితే శ్మశానికి వెళ్లేందుకు పొలాల్లోని కాలి బాటను వినియోగిస్తున్నామని తెలిపారు. ఇటీవల పొలాలను వెంచర్లుగా మార్చి దారిని మూసేస్తున్నారని వాపోయారు. ఈ విషయంపై పలుమార్లు తహసీల్దార్, గూడూరు సబ్ కలెక్టర్, జిల్లా కలెక్టర్‌కు విన్నవించినా ఫలితం లేదన్నారు. దారులు మూసేస్తే మృతదేహాలను శ్మశానినికి ఎలా తీసుకెళ్లాలని నిలదీశారు. రెవెన్యూ అధికారులు పూర్తి స్థాయి సర్వే చేసి ప్రభుత్వ భూమిలో దారిని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. రెవెన్యూ అధికారులు వారితో చర్చించారు. రికార్డుల్లో అన్నీ పట్టా భూములని ఉన్నాయని, దీనిపై ఉన్నతాధికారులతో మాట్లాడి నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. దీంతో గ్రామస్తులు మరోసారి జిల్లా కలెక్టర్‌ను కలవాలని నిర్ణయం తీసుకున్నారు.

వేస్ట్ మేనేజ్‌మెంట్‌పై అవగాహన ర్యాలీ


ర్యాలీ నిర్వహిస్తున్న ఎన్‌సీసీ క్యాడెట్స్

సూళ్లూరుపేట : ఎన్‌సీసీ డేను పురస్కరించుకుని శుక్రవారం సూళ్లూరుపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్‌సీసీ క్యాడెట్స్ వేస్ట్ మేనేజ్‌మెంట్‌పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ర్యాలీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల నుంచి షార్ బస్టాండ్ వరకు సాగింది. ప్రిన్సిపాల్ ఎస్‌ఎల్‌బీ శంకరశర్మ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. పర్యావరణాన్ని కాపాడడంలో విద్యార్థులు ప్రముఖపాత్ర పోషించాలని కోరారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ పి.విక్టోరియారాణి, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఎన్‌సీసీ క్యాడెట్ల ర్యాలీ


ర్యాలీ చేస్తున్న ఎన్‌సీసీ క్యాడెట్లు

కోట: విద్యానగర్ ఎన్‌బీకేఆర్ ఐఎస్టీ నావల్ యూనిట్ ఎన్‌సీసీ క్యాడెట్లు శుక్రవారం ఎన్‌సీసీ డే సందర్భంగా కళాశాల నుంచి వాకాడు వరకు సైకిల్ ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా దేశం కోసం ప్రాణాలు త్యాగం చేసిన సైనికులకు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నావల్ యూనిట్ ఆఫీసర్ మల్లికార్జునరెడ్డి, హెచ్‌వోడీ చింతా రవీంద్రరెడ్డి పాల్గొన్నారు.

హామీలను వెంటనే అమలు చేయాలి


మాట్లాడుతున్న హరినాథ్‌రెడ్డి

వెంకటగిరి(సైదాపురం) : ఎన్నికల ముందు కూటమి నేతలు ఇచ్చిన హామీలను అమలు చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి హరినాథ్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఆయన శుక్రవారం వెంకటగిరిలోని ఒక ప్రైవేటు ఫంక్షన్ హాల్‌లో శ్రీకాళహస్తి, వెంకటగిరి నియోజకవర్గాల పార్టీ శాఖా కార్యదర్శులతో సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ గతంలో పెత్త ఎత్తున పోరాడి సాధించుకున్న జీవోలను ప్రస్తుత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలుచేయడం లేదన్నారు. స్కీమ్ వర్కర్లను ప్రభుత్వ వర్కర్లుగా గుర్తించి కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి పి.మురళీ, నియోజకవర్గ కార్యదర్శి పి.బాలకృష్ణయ్య, కార్యవర్గ సభ్యుడు జనమాల గురవయ్య, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి, రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మద్యం షాపు పెట్టొద్దని ఆందోళన


మద్యం షాపు నిర్వాహకులతో వాగ్వాదానికి దిగిన మహిళలు

సైదాపురం: తమ కాలనీలో మద్యం షాపు పెట్టొద్దని కలిచేడు గ్రామం ఎస్సీ కాలనీ వాసులు శుక్రవారం ఆందోళన చేపట్టారు. ఎట్టి పరిస్థితుల్లో మద్యం షాపును పెట్టనివ్వబోమని భీష్మించారు. మండలంలోని కలిచేడు సమీపంలో మద్యం షాపు ఏర్పాటు చేసేందుకు నిర్వాహకులు శుక్రవారం మరోసారి ప్రయత్నించారు. విషయం తెలుసుకున్న ఎస్సీ కాలనీకి చెందిన మహిళలు పెద్ద సంఖ్యలో అక్కడికి చేరుకున్నారు. గతంలో షాపు పెట్టొద్దని నిరసన తెలిపినా మళ్లీ రావడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇక్కడ మద్యం షాపు ఏర్పాటు చేస్తే రోడ్డు పైనే కూర్చుంటామని హెచ్చరించారు. నిర్వాహకులతో వాగ్వాదానికి దిగారు. దీంతో వారు అక్కడి నుంచి వెళ్లిపోయారు. మాజీ ఎంపీటీసీ గుమ్మడి వీరాస్వామి మాట్లాడుతూ ఎస్సీకాలనీలో అందరూ కూలి పనులు చేసుకుని జీవనం సాగిస్తున్నారని తెలిపారు. మద్యం షాపు ఏర్పాటు చేయడం ద్వారా వారి కుటుంబాలు వీధిన పడతాయని, విద్యార్థులు, మహిళలు ఇబ్బందులు పడతారని పేర్కొన్నారు.